# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 30-05-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టాలని భారత ఎన్నికల సంఘం ఉప కమిషనర్ నితీష్ వ్యాస్ ఎన్నికల అధికారులను ఆదేశించారు.**

**2.** **ఆంధ్రప్రదేశ్‌లో జూన్ నెలకు సంబంధించిన సామాజిక భద్రతా పింఛన్ల నగదును రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.**

3. **తెలంగాణలో పత్తి విత్తనాలకు కొరత లేదని, అవసరాల మేరకు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.**

**4.** **ఆంధ్రప్రదేశ్‌లో ఓట్ల లెక్కింపు, 144 సెక్షన్ అమలు కారణంగా పాలిసెట్ కౌన్సెలింగ్‌లో మార్పులు చేసినట్లు సాంకేతిక విద్యాశాఖ పేర్కొంది.**

**5.** **ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రత, వడ గాల్పుల తీవ్రత కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది.**

==========================

కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ, ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టాలని భారత ఎన్నికల సంఘం ఉప కమిషనర్ నితీష్ వ్యాస్ అన్ని జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియపై నిన్న ఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమం ద్వారా నిర్వహించిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా, రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారితో సహా అన్ని నియోజకవర్గాల జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నితీష్ వ్యాస్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా చూడాలని పేర్కొన్నారు. లెక్కింపు కేంద్రాల వద్దకు ఇతరులను అనుమతించవద్దని, భద్రతా వ్యవస్థలో లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. పల్నాడు, రాయలసీమ ప్రాంతాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఘర్షణలు జరిగిన విషయాన్ని దృష్టిలో పెట్టుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జూన్ నెలకు సంబంధించిన సామాజిక భద్రతా పింఛన్ల నగదును రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. 65.30 లక్షలకు పైగా పింఛనుదారులకు 19 వందల 39.35 కోట్ల రూపాయలను విడుదల

చేసినట్లు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ తెలిపారు. జూన్ 1న నగదు బదిలీ విధానం ద్వారా 47.74 లక్షల మంది ఖాతాల్లో పింఛన్ల నగదును జమ చేస్తామని వెల్లడించారు. మిగిలిన వారికి జూన్ 1 నుంచి 5వ తేదీ మధ్య ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్లు పంపిణీ చేస్తామన్నారు. ఎన్నికల నియమావళిని పాటిస్తూ ఏప్రిల్ నెలలో గ్రామ, వార్డు సచివాలయాల్లో పింఛన్లను పంపిణీ చేసిన ప్రభుత్వం, గత నెలలో బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసింది. ఈసారి బ్యాంకు ఖాతాల్లోనే వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

---------------------------

కేంద్ర హోం మంత్రి అమిత్ షా రేపు తిరుమలలో పర్యటించనున్నారు. తమిళనాడులోని తిరుచిరాపల్లి నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి ఈ రోజు సాయంత్రం ఆయన చేరుకుంటారు. రాత్రికి తిరుమలకు చేరుకుని బస చేస్తారు. రేపు ఉదయం శ్రీ వెంకటేశ్వర స్వామి అభిషేక సేవలో పాల్గొని దర్శించుకుంటారు. అనంతరం తిరుమల నుంచి రేణిగుంట విమానాశ్రయానికి తిరుగు ప్రయాణం అవుతారు. అమిత్ షా పర్యటించనున్న క్రమంలో తిరుమలలో అధికారులు భద్రతా ఏర్పాట్లు చేసారు.

---------------------------

జూన్ 2 న తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలు జరగనున్న క్రమంలో తెలంగాణ రాష్ట్ర గీతం, చిహ్నం పై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశాలను నిర్వహించారు. హైదరాబాద్ లో నిన్న నిర్వహించిన ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సూచనలతో తెలంగాణా పోరాటం, త్యాగాలను ప్రతిబింబించేలా రాష్ట్ర గీతం, చిహ్నం రూపు దిద్దుకుంటున్నాయని ఆవిర్భావ వేడుకల్లోనే వీటిని ఆవిష్కరించనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

తెలంగాణలో పత్తి విత్తనాలకు కొరత లేదని, రైతుల అవసరాల మేరకు విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. విత్తనాలు, ఎరువుల లభ్యతపై హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి మాట్లాడుతూ, మూడు రోజులుగా పత్తి విత్తనాలకు కొరత ఉన్నట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తమని తెలిపారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి విత్తన కంపెనీలతో సమావేశాలు నిర్వహించి నిల్వలను సిద్ధం చేసినట్లు చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో రైతులు పత్తి విత్తనాల కోసం అడగడంతో ఒక్కొక్కరికీ రెండేసి ప్యాకెట్ల చొప్పున ఇస్తున్నట్లు వివరించారు. ఎరువులకు కూడా ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఓట్ల లెక్కింపు, 144 సెక్షన్ అమలు కారణంగా పాలిసెట్ కౌన్సెలింగ్‌లో మార్పులు చేసినట్లు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జూన్ 2 వరకు ఉన్న ఫీజు చెల్లింపు, ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియలో ఎలాంటి మార్పూ లేదని, జూన్ 3న నిర్వహించాల్సిన కౌన్సెలింగ్‌ని జూన్ ఆరో తేదీకి మార్చామని పేర్కొన్నారు. జూన్ 7 నుంచి 10వ తేదీ వరకు కళాశాలలు, కోర్సులకు వెబ్ ఐచ్ఛికాల నమోదు చేసుకోవచ్చని సూచించారు. జూన్ 11న ఐచ్ఛికాల మార్పునకు అవకాశం ఉంటుందని, 13న సీట్ల కేటాయింపు పూర్తి చేస్తామని తెలిపారు. జూన్ 14 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

---------------------------

గత సంవత్సరం ఢిల్లీలో జరిగిన 3వ జాతీయ ముఖ్య కార్యదర్శుల సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై సంబంధిత శాఖలు తీసుకున్న చర్యలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. ఎస్. జవహర్ రెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్య కార్యదర్శుల సమావేశంలో చర్చించిన అంశాలపై సంబంధిత శాఖలు సకాలంలో చర్యలు తీసుకుని వెంటనే నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. భూమి, ఆస్తులు, విద్యుత్, తాగునీరు, వైద్య ఆరోగ్యం, విద్యా శాఖలకు సంబంధించి చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యల నివేదికను నీతి ఆయోగ్ కు సమర్పించాల్సి ఉంటుందని, కావున సంబంధిత శాఖలు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

---------------------------

తెలంగాణలో 563 గ్రూప్-1 సర్వీసుల పోస్టులకు జూన్ 9న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ - టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. ఉదయం 10 నుంచి 30 నిమిషాల మధ్యాహ్నం 1 వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతిస్తామని తెలిపారు. జూన్ 1వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రిలిమినరీ పరీక్ష హాల్‌టికెట్లు కమిషన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఓట్ల లెక్కింపు నియమ నిబంధనలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోలింగ్ ఏజెంట్లు అవగాహన పెంచుకోవాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. నిన్న తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో కౌంటింగ్ ఏజెంట్లకు కార్యశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు జరిగేటప్పుడు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

---------------------------

తెలంగాణ పాఠశాలల్లో చిన్నారుల నమోదు కోసం నిర్వహించే బడిబాట కార్యక్రమం జూన్ 3 నుంచి 19వ తేదీ వరకు జరపాలని నిర్ణయిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నెల 31న మండలస్థాయి, జూన్ 1న గ్రామ పాఠశాల స్థాయిలో సన్నద్ధత సమావేశాలు నిర్వహించాలని, పాఠశాలల్లో ముఖ్యమైన పనులను జూన్ 10వ తేదీ నాటికి పూర్తిచేయాలని, మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. పుస్తకాలు, ఏకరూప దుస్తులను సిద్ధంగా ఉంచాలని, 12వ తేదీన పాఠశాలల పునఃప్రారంభం నాడు తల్లిదండ్రులతో సమావేశాలు జరిపేందుకు ఏర్పాట్లు పూర్తిచేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.

---------------------------

ఓట్ల లెక్కింపు రోజు కౌంటింగ్ ఏజెంట్లు సంయమనంతో వ్యవహరించాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. నిన్న హైదరాబాద్ నుంచి పార్టీ ముఖ్యనేతలతో దృశ్య మాధ్యమం ద్వారా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూన్ 1న జోనల్ స్థాయిలో తెలుగు దేశం పార్టీకి చెందిన కౌంటింగ్ ఏజెంట్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

---------------------------

జూన్ 1 నుండి 10వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో వుంటుందని నంద్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు తెలిపారు. నంద్యాలలోని ఇంజనీరింగ్ ఫార్మసీ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అనధికార వ్యక్తులకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు ప్రవేశించకుండా భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిసి కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు.

---------------------------

ఖైదీల సంక్షేమంలో భాగంగా ఏర్పాటుచేసిన ఈ–ములాఖత్ వీడియో కాలింగ్ సదుపాయాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ప్రారంభించామని కారాగారం సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు ఖైదీల బంధువులు, కుటుంబీకులు ములాఖత్ ద్వారా నేరుగా మాత్రమే కలుసుకుని మాట్లాడే వీలుండేదని, తాజాగా జైళ్లశాఖ ఆదేశాల మేరకు.. ఈ–ములాఖత్ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. ఇందుకోసం ఈ–ములాఖత్ అనే వెబ్‌సైట్ రూపొందించామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మరో ఐదు రోజుల పాటు కోస్తా, రాయలసీమ జిల్లాలో ఎండ, వడగాల్పుల తీవ్రత కొనసాగుతుందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఉదయం 11గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ప్రజలు ఇంట్లోనే ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.కాగా నిన్న రాష్ట్రంలో 195 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 147 మండలాల్లో వడగాల్పులు వీశాయని పేర్కొంది.

అలాగే రానున్న రెండు రోజుల్లో తెలంగాణలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రేపు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు పేర్కొంది. పశ్చిమ, వాయువ్య దిశల నుంచి రాష్ట్రంలోకి వేడి గాలులు వీస్తున్నట్టు తెలిపింది.దీని ప్రభావంతో రాగల రెండ్రోజులు పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా రెండు నుంచి మూడు డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది.

======================